## క్లుప్తంగా

### వెంకన్న దేవస్థానంలో టిక్కెట్ కౌంటర్ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన టిక్కెట్ కౌంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం ఉదయం ప్రారంభించారు. భక్తుల సహకారంతో నిర్మించిన టిక్కెట్ కౌంటర్ వల్ల టిక్కెట్ల విక్రయం ఇక నుంచి సులభతరం కానుందని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, వార్డు కౌన్సిలర్ గండి దేవీ హారిక, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నేత శ్రీను, మాజీ కౌన్సిలర్ నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

### నేత్రదానం


దాసరి సత్యవతి

తాళ్లరేవు: గ్రామ పంచాయతీకి చెందిన దాసరి సత్యవతి(58) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ సత్యవతి భర్త గోపాలకృష్ణ, కుమారుడు సత్యన్నారాయణలతో మాట్లాడి కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేసారు. ఐ బ్యాంక్ సిబ్బంది జి.రవి, కె.నానిలు కార్నియాలను సేకరించారు. నేత్రదానం వల్ల ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచర్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌లో 154 కేసులు పరిష్కారం

ముమ్మిడివరం: స్థానిక జూనియర్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అధాలత్‌లో 154 కేసులు పరిష్కరించినట్లు లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. వీటిలో ఈపీలు ఐదు కేసులు, ఓఎస్‌మనీ నాలుగు కేసులు, ఓఎస్ టైటిల్ మూడు, ఎంసీ కేసులు 3, డీవీసీ ఒకటి, ఎన్ 1యాక్ట్ కేసులు ఏడు, ఐపీసీ సీసీలు 38 కేసులు ఎక్సైజ్ కేసులు 79, బ్యాంక్ పీఎల్‌సీలు ఆరు కేసులు, బీఎస్ఎన్ఎల్ సీలు 7కేసులు, బెంచ్‌కోర్టు ఒకటి కేసు, పరిష్కరించి, రూ. 50,62,453 రికవరీ చేశారు. ఏజీపీ కాశి సిద్ధార్థకుమార్, దోనిపాటి ఆంజనేయులు, గ్రంధి రామారావు, కేఆర్‌కేరాజు, బీర ప్రసాదబాబు, గుత్తుల శ్రీనివాసరావు, ఎంఆలీ హుస్సేన్, ముడే వెంకటరావు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

**అమలాపురంలో 277 కేసులు..**

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాత్‌లో 277 కేసులు పరిష్కారం అయ్యాయి. అమలాపురం జిల్లా రెండో అదనపు కోర్టులో న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి.గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ ద్వారా 277 కేసులను పరిష్కరించుకున్నారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి, సివిల్ జడ్జి ఎం రహమతుల్లా, జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీలేఖ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

### బీఎస్సీ నర్సింగ్ మెరిట్ జాబితా విడుదల

యానాం: 2025-26 విద్యాసంవత్సరానికి యూజీనాన్‌నీట్ బీఎస్సీ నర్సింగ్‌కోర్సులో ప్రభుత్వ కోటా సీట్లలో భర్తీచేయడానికి నిర్వహించిన పినెట్-2025 ఎంట్రన్స్‌టెస్ట్‌లో ఫలితాల ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందించినట్లు శనివారం సెంటాక్ కోఆర్డినేటర్ అమన్‌శర్మ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అభ్యంతరాలను సెంటాక్ పుదుచ్చేరి వెబ్‌సైట్ ద్వారా డాష్ బోర్డులో అబ్జక్షన్స్ లింక్‌లో ఈనెల 7లోగా తెలియజేయాలని కోరారు. అదేవిధంగా ఇందిరా గాంధీ మెడికల్ కళాశాల, మదర్ థెరిస్సా పోస్టుగాడ్యుయేట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పుదుచ్చేరి, కారైకల్‌లలో సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లు, ఎన్ఆర్ఐ కోటా సీట్లను నీట్‌యూజీ-2025లో వచ్చిన ర్యాంకు ద్వారా మాత్రమే భర్తీ చేస్తామన్నారు.

### ఎంబీబీఎస్ ర్యాంకు జాబితా విడుదల

యానాం: నీట్ ఎంట్రన్స్ ఆధారంగా పుదుచ్చేరి రాష్ట్ర ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి ర్యాంకుల జాబితాను శనివారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ విడుదల చేసింది. ఈ ర్యాంకుల ఆధారంగా ప్రభుత్వ కోటా, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. జి ప్రశాంత్ 640 మార్కులతో ప్రథమ స్థానం, శ్రీకిరణ్ కొడకడలి 632 మార్కులతో ద్వితీయ స్థానం, ఆర్.జగన్నివాసన్ 629 మార్కులతో తృతీయ స్థానం సాధించారని తెలిపారు.

### పోచాలమ్మ అమ్మవారికి ఆషాఢం సారె

ఐ.పోలవరం: పెద్దవీధి గ్రామంలో ఉన్న పోచాలమ్మ అమ్మవారికి సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆలయ కమిటీ, గ్రామస్తులు, పారాయణం, భజన మండలి మాతృమూర్తులు, వివిధ రకాల స్వీట్లు, పండ్లు, చలిమిడి పానకాలు, పువ్వులు, నూతన వస్త్రాలు అమ్మవారికి అందజేశారు. భాజా భజంత్రీలతో సారెను పట్టుకుని శోభాయాత్రగా నిర్వహించారు. పురవీధుల్లో అమ్మవారికి కుంకుమార్చన చేసి సారె సమర్పించారు. ఈ కార్యక్రమం ఎస్ఎస్ఎఫ్ మండల మహిళా సహ కన్వీనర్ గంగ్రోతు వరలక్ష్మి, గ్రామ కన్వీనర్ అనివెల్ల రత్నం లు పర్యవేక్షించారు. ముమ్మిడివరం ఖండ ధర్మ ప్రచారక్ కనకారావు మాట్లాడుతూ అమ్మవారికి ఆషాఢంలో పురజనులు తమ శక్తి కొలదీ సారె సమర్పించడం వలన గ్రామ దేవతలు అనుగ్రహించి గ్రామాన్ని కాపాడుతోందన్నారు.

# విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

- అమలాపురం ఆర్డీఓ మాధవి
- వరదలపై అధికారులకు సూచనలు
- లంక గ్రామాల్లో పర్యటించిన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి తదితరులు

ముమ్మిడివరం: తుపాను, గోదావరి వరదల వంటి విపత్తులను ఎదుర్కొనేందుకు మండల స్థాయి అధికారులు సిద్ధం కావాలని అమలాపురం ఆర్డీఓ కే మాధవి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం అధికారులతో వరదలు ఎదుర్కొనేందుకు సన్నద్ధత కార్యక్రమాలపై మండలస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో గోదావరి వరద వచ్చే అవకాశమున్నందున వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే ముందస్తు జాగ్రత్తలతో తీసుకోవాలని సూచించారు. ముందుగా మండల స్థాయిలో విపత్తుల నిర్వహణ కార్యచరణ ప్రణాళికలు శాఖల వారీగా రూపొందుకుని ముందస్తు జాగ్రత్త చర్యలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలు, సిద్ధం చేయడం చౌక ధరల దుకాణాలలో మూడు నెలల సరిపడా నిత్యావసరాలు నిల్లలు చేసుకోవాలన్నారు. ఆర్ అండ్ బీ అధికారులు పవర్ రంపాలు, జేసీబీలను కూడా సిద్ధం చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారులు మోటారు బోట్లు, గజ ఈతగాళ్లు, లైవ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాలనూ సిద్ధం చేయాలన్నారు. ముంపు బాధితులకు భోజన ఏర్పాట్లు తదితర సహాయ కార్యక్రమాలకు కార్యాచరణకు చెక్ లిస్టు జిల్లా యంత్రాంగం రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**చెట్లు నాటుదాం, పచ్చదనాన్ని పెంచుదాం**

అమలాపురం రూరల్: పర్యావరణ సమతుల్యంతోనే జీవవైవిధ్యాన్ని కాపాడగలమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మానవ మనుగడకు తోడ్పాటు అందించాలని ఆర్డీవో కె.మాధవి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం కామనగరువు ఆదిత్య స్కూల్ విద్యార్థులతో శనివారం వన మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కామనగరువు ఆదిత్య స్కూల్ నుంచి ప్రారంభమై ఎర్రవంతెన, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, తాలూకా పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఆర్డీవో మాట్లాడుతూ భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తాలూకా ఎస్ఐ శేఖర్ బాబు మాట్లాడుతూ మొక్కలను నాటి ప్రకృతికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని ప్రమాణం చేయించారు. ఆదిత్య పాఠశాల ప్రిన్సిపాల్ రామప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి సుధా రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**వరద ముందస్తు చర్యలపై అవగాహన**

తాళ్లరేవు: ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా గోదావరికి వరద అనివార్యమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ పితాని త్రినాథరావు లంక గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ నేతృత్వంలో మండల అధికారులు వరద ప్రభావిత గ్రామాలైన పిల్లంక గ్రామ శివారు కొత్తలంక, ఇంజరం గ్రామ శివారు అరటికాయలంక గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు ఎటువంటి ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్, ఆర్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు.

### కొబ్బరి చెట్ల వేలం


తాళ్లరేవు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

తాళ్లరేవు: గ్రామ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలలో ఉన్న కొబ్బరి చెట్లకు సంబంధించి కొబ్బరి కాయల కాపు కోసం బహిరంగ వేలం నిర్వహించగా రూ.82 వేల ఆదాయం సమకూరినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్ఎం ప్రకాష్ ఆధ్వర్యంలో పెంకే పేట చెరువుగట్టు, చెరువుగట్టు సెంటర్‌లోని గనిపోతురాజు చెరువుగట్టుపై గల కొబ్బరి చెట్లకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన భారతి వెంకటేశ్వర్లు రూ.82వేలకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి అరుణ సుహాసినీదేవి, ముద్రగడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ జిల్లా కార్యదర్శుల నియామకం


చల్లపల్లిలో దంగేటి దొరబాబును దుశ్శాలువాతో అభినందిస్తున్న పార్టీ నాయకులు


చల్లపల్లిలో బడుగు మేరీకుమారిని దుశ్శాలువాతో అభినందిస్తున్న పార్టీ నాయకులు


రాయపురెడ్డి జానకీరామయ్య


కాశి రామకృష్ణ


పొగాకు శ్రీను

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను జిల్లా విభాగాల్లో కార్యదర్శులుగా నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని చల్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పలగుప్తం మాజీ వైస్ ఎంపీపీ బడుగు మేరీ కుమారిని జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా, జిల్లా కార్యదర్శులుగా చల్లపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ డీసీసీబీ డైరెక్టర్ దంగేటి విశ్వేశ్వర వెంకట రెడ్డినాయుడు (దొరబాబు), ఎస్.యానం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పొగాకు శ్రీనులను పార్టీ జిల్లా విభాగంలో నియమించారు. ఈ మేరకు దొరబాబు, మేరీకుమారీలను పార్టీ నాయకులు వారి నివాసాల్లో దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, పార్టీ నాయకులు భోగిశెట్టి నరసింగరావు, బీర బాలరాజు, పట్టా సత్తిబాబు, ముత్యాల దేవరాజు, గోడ వెంకటరమణ, కాట్రు మధు, కొల్లు దేవేంద్రుడు, పరమట పండు, వజ్జరపు నాగరాజు, చీకురుమెల్లి సతీష్, కాట్రు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శిగా పట్టణానికి చెందిన పార్టీ నాయకుడు కముజు వెంకటరమణ మరోసారి నియమితులయ్యారు. గత జిల్లా కమిటీలో కూడా వెంకటరమణ ఇదే పదవిని చేపట్టారు. పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లాకు కొత్తగా నియమించిన జిల్లా కమిటీలో వెంకటరమణకు అదే పదవికి దక్కింది. తన నియమకానికి కృషి చేసిన అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌లకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పార్టీ పటిష్టతకు తన వంతు ఎప్పటిలాగే కృషి చేస్తానని వెంకటరమణ పేర్కొన్నారు.

ముమ్మిడివరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోన సీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముమ్మిడివరం మండలానికి చెందిన రాయపురెడ్డి జానకీరామయ్య, జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా కాశిరామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. పార్టీ పదవులు ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం కోఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నియోజకవర్గ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైఎస్సార్ సీపీ పట్టణ, మండలాల కమిటీల ఏర్పాటు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని పట్టణం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు పార్టీ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

**అమలాపురం పట్టణం**

అమలాపురం పట్టణ పార్టీ ఉపాధ్యక్షులుగా పొలమూరి ప్రవీణ్, కల్వకొలను ఉమ, ప్రధాన కార్యదర్శులుగా సుంకర వీర వెంకట కుమార్, విత్తనాల మూర్తి, మద్దింశెట్టి ప్రసాద్, శింగంశెట్టి నాగ వెంకట సత్య గణపతిరావు, కార్యదర్శులుగా ఎన్.శ్రీనివాసరాజు, మంథా ఉమా మహేష్, ఉప్పాడ సుబ్బారావు, ఆశపు రవిశంకర్, పాలెపు గంగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చదలవాడ రాజారావు, ఈతకోట రాంబాబు, చవటపల్లి ఏడుకొండలు, గుత్తుల వెంకటేశ్వర్, నూతనపాటి వెంకట్, కుడుపూడి శ్రీనివాస్, ఆకుమర్తి సత్యనారాయణ, రేపాక దేవదీవెన, రాయుడు రూపావతి, మట్ట వెంకట నారాయణ, ఇంజవరపు జేజిబాబు, కాళే వెంకటేశ్వరరావు, వస్కా రజని, చింతా వెంకటేశ్వరరావు, నగభేరి శ్రీనివాసరావు నియమితులయ్యారు.

**అల్లవరం మండలం**

అల్లవరం మండల పార్టీ ఉపాధ్యక్షులుగా కుడుపూడి శ్రీను, తిక్కా వెంకట రెడ్డినాయుడు, ప్రధాన కార్యదర్శులుగా వాసంశెట్టి నరసింహరావు, నార్గన శ్రీనివాసరావు, ఈతకోట సతీష్, చెద్దళ్ల వాసుదేవుడు, కార్యదర్శులుగా బీర దుర్గా ప్రసాద్, ఇళ్ల శ్రీనివాసరావు, పచ్చిమాల లీలాప్రసాద్, కొంకు బాబూరావు, ఆకుమర్తి అమృతరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కడలి సత్య ప్రసాద్, పినుపోతు సత్యనారాయణ, దాసరి బాలాస్వామి, అవనిగడ్డ శేషయ్య, రేవు సుందరరావు, పినిపే ప్రకాశరావు, పెనుమాల విక్రమ్, తాడి సుమంత్, మట్టపర్తి సత్తిబాబు, కోరుకొండ చిట్టిబాబు, పరమట సురేష్‌లు నియమితులయ్యారు.

**ఉప్పలగుప్తం మండలం**

ఉప్పలగుప్తం మండల పార్టీ ఉపాధ్యక్షులుగా పెట్టా అప్పారావు, పడాల మాచరరావు, ప్రధాన కార్యదర్శులుగా పినిపే జయరాజు, అంగాని శ్రీను, జంపన సత్యనారాయణరాజు, శీలం సూరిబాబు, కార్యదర్శులుగా వరసాల వెంకటలక్ష్మి, కోరుకొండ కిరణ్, సీహెచ్.నాగబాబు, బళ్ల వీర వెంకట సత్యనారాయణ, బడుగు గణేష్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా నిమ్మకాయల దుర్గారావు, అక్కల నరసింహస్వామి, పరమట నాగకుమారి, జనిపిల్లి వరలక్ష్మి, ఆశపు వీరభద్రరావు, గుత్తుల విష్ణు ప్రసాద్, బడుగు రమేష్, నల్లా సూర్య ప్రకాష్, అయితాబత్తుల వెంకటేశ్వరరావు, అంగాని వీరబాబు, నల్లా వెంకటేశ్వరరావు, దంగేటి పాపయ్య, ఆకేటి విష్ణు, కొంకి బాలకృష్ణ నియమితులయ్యారు.

## రెవెన్యూ ఉద్యోగులకు ప్రొటోకాల్ డ్యూటీ తొలగించడంపై హర్షం

అమలాపురం రూరల్: రెవెన్యూ ఉద్యోగులకు ప్రొటోకాల్ డ్యూటీ తొలగించడంపై కోనసీమ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. జిల్లా గ్రామ రెవెన్యూకారుల ఆఫీస్ బేరర్ సమావేశం జిల్లా అధ్యక్షుడు సాధనాల ఏల్లేశ్వరావు అధ్యక్షతన అమలాపురంలో తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా తహసీల్దార్, రాష్ట్ర జేఏసీ చైర్మవాసా దివాకర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో రెవెన్యూ శాఖకు సంబంధించి జరిగిన చర్చల్లో భూ సంబంధ నిర్ణయాలతోపాటు ఏ శాఖకు సంబంధించి ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్ డ్యూటీలు రెవెన్యూ శాఖకు ప్రొటోకాల్ పాటించడం వల్ల శాఖాపరమైన పనులు వెనకబడి పోతున్నాయని అన్నారు. ప్రొటోకాల్ డ్యూటీలు రెవెన్యూ శాఖను మినహాయిస్తున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్ నిర్ణయం తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కొప్పుశెట్టి గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీవీ సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

తాళ్లరేవు: చిత్తూరు జిల్లా మదనపల్లి రూరల్ మండలం అంకిశెట్టిపల్లి గ్రామంలో బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుద్ధుని కొండపై ఉన్న బుద్ధవిహార్‌లోని బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి యడ్ల కుటుంబరావు మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని, ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని రెడ్డి గిరిబాబు, జక్కల ప్రసాద్, రెడ్డి రెడ్డిబాబు, పెయ్యల రమేష్, శ్రీనివాస్, చిన్నారి డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం కామనగరువు ఆమని ఆటోమొబైల్స్ సమీపం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. మోటారుసైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను మినీ లారీ ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి గ్రామానికి చెందిన మూసమల్ల దొరయ్య, మాణిక్యాంబ దంపతులు వైద్యం చేయించుకునేందుకు మోటారుసైకిల్‌పై అమలాపురం బయలుదేరారు. ఆమని ఆటో మొబైల్స్ బైపాస్ జంక్షన్ వద్ద రోడ్డు అమలాపురం వైపు రోడ్డుదాటుతుంగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దాంతో దొరయ్య, మాణిక్యాంబలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుండి వీరిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అమలాపురం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

# వైద్య విద్యార్థుల జీవితాలను నాశనం చేయవద్దు

- వైఎస్సార్ సీపీ నేత వెంకన్నాయుడు



అమలాపురం టౌన్: విదేశాల్లో చదువుతున్న వైద్య విద్యార్థులు శాంతియుతంగా చేస్తున్న ఆందోళనపై పోలీసులు దాడి చేయడం అమానుషమని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత, రాజోలు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వంటెద్దు వెంకన్నాయుడు అన్నారు. ఆ విద్యార్థులపై కనీక కనికరం లేకుండా ఇబ్బంది పెట్టడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలో వెంకన్నాయుడు శనివారం స్థానిక మీడియాతో మాట్లాడారు. వైద్య విద్యార్థులపై దాడులు, పోలీసు కేసులు పెట్టి వారి జీవితాలను నాశనం చేయవద్దని ఆయన హితవు పలికారు. ఈ ప్రభుత్వం అన్ని రంగాల వారిని ఇబ్బంది పెడుతోందని, ఇప్పుడు వైద్య విద్యార్థులను కూడా వదలడం లేదని పేర్కొన్నారు. విదేశాల్లో మెడికల్ కోర్సులు పూర్తి చేసుకుని, ఈ ప్రభుత్వం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న విద్యార్థులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వెంకన్నాయుడు స్పష్టం చేశారు. ఇక్కడ మెడికల్ సీట్లు రాకపోవడంతో ఎన్నో కష్టనష్టాలకోర్చి అప్పులు చేసి మరీ విదేశాలకు వెళ్లి చదువుతున్న వారిపై అనుచితంగా ప్రవర్తించడం అన్యాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రంలో ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని ఆయన గుర్తు చేశారు. ఆ కళాశాలల ద్వారా మెడికల్ సీట్లు పెంచి పేద విద్యార్థులు కూడా స్థానికంగానే చదువుకునేలా ప్రణాళిక రూపొంచారని స్పష్టం చేశారు. నిర్మాణాల చేపట్టిన 17 కళాశాలల్లో అయిదు కళాశాలలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రైవేటు రంగానికే పెద్ద పీట వేసి కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను కూడా కూటమి ప్రభుత్వం ప్రైవేట్ గుప్పిట్లో పెడుతోందని ఆరోపించారు. ఫీజుల నియంత్రణ అనేది లేకుండా ప్రైవేటు విద్యా సంస్థలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తూ కొంగ జపం చేస్తోందని వెంకన్నాయుడు విమర్శించారు.

## రావూరి భరద్వాజకు ఘన నివాళి

అమలాపురం టౌన్: జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ జయంతి కార్యక్రమం జిల్లా కార్పెంటర్ చేతి వృత్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగింది. తొలుత రావూరి భరద్వాజ చిత్ర పటానికి సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, సంఘీయులు పూల మాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘం ప్రతినిధులు పితాని బేబీరావు, సాధనాల రామకృష్ణ, కొనుకు వెంకటేశ్వరరావు, కేతా సోమేశ్వరరావు, పొలమూరు బాలకృష్ణ తదితరలు రావూరి భరద్వాజ రచనా వైభవాన్ని కీర్తించారు.

## వంద శాతం బ్యాంకు ఖాతాలు లక్ష్యం

అల్లవరం: జన సురక్ష కార్యక్రమంలో భాగంగా బ్యాంకు ఖాతాలు లేని వారిని గుర్తించి రానున్న మూడు నెలల కాలంలో ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండేలా వినియోగదారుల్లో అవగాహన పెంచుతున్నామని లీడ్ జిల్లా మేనేజర్ కేశవ వర్మ అన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు అధ్యక్షతన దేవగుప్తం సచివాలయం వద్ద బీమా పథకాలు, అన్ క్లెయిమ్ డిపాజిట్లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతుల నాగరాజు, బ్యాంకు అధికారి దినేష్, సిబ్బంది వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మా ఉద్యోగాలు ఇప్పించండి

- ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన


మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సాక్షి, అమలాపురం: 'మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి మహాప్రభో' అని ఐ.పోలవరం ఉన్నత పాఠశాల మధ్యాహ్నం భోజన కార్మికులు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. గత 18 సంవత్సరాల నుంచి మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా ఐ.పోలవరం హైస్కూల్‌లోమహాలక్ష్మి ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న ఇళ్ల వెంకటలక్ష్మి, కట్టా లక్ష్మి, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, ఇళ్ల దుర్గలను ఒక్కసారిగా విధుల నుంచి తీసి వేశారు. దీనితో ఎంఈవో కార్యాలయం వద్ద శనివారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకుండా అర్ధాంతరంగా మా ఉద్యోగాలను తీసేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్ల నుంచి ఈ ఉద్యోగం మీద ఆధారపడి తాము బతుకుతున్నామని, ఉద్యోగం పోవడంతో మా బతుకులు రోడ్డు మీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ఒత్తిడి వల్లే మమ్మల్ని ఉద్యోగాల నుంచి తీసేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించిన మళ్లీ తమకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతున్నారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.దుర్గారావు తోపాటు పలువురు మద్దతు పలికారు.

**జూలై 9న దేశ వ్యాప్త సమ్మె**

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ జూలై తొమ్మిదో తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.దుర్గారావు కోరారు. దీనిపై ఆయన ఐ.పోలవరంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న సమ్మెలో మధ్యాహ్నం భోజనం కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యవేణి పాల్గొని కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, గంగారత్నం, గంగా భవానీ, పార్వతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ప్రసాద్



అమలాపురం టౌన్: స్థానిక రోటరీ క్లబ్ నూతన కధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఆర్డీఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గంతో స్థానిక రోటరీ కల్యాణ మండపంలో శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ కార్యదర్శిగా ఆకొండి ఎస్‌వీఎస్ఎస్ పవన్ కుమార్, కోశాధికారిగా కూచిమంచి శశిధర్ శ్రీరామ్, ఎగ్జిక్యూటీవ్ సెక్రటరీగా కె.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కేవీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వి.సుబ్రహ్మణ్యంతో పాటు క్లబ్ వివిధ విభాగాల చైర్మన్లగా 16 మంది రోటరీ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి వరకూ (గత సంవత్సరం) క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పని చేసిన ఏవీవీబీ స్వామి (వీరన్న), వరదా మల్లేశ్వరరావుల నుంచి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. నూతన కార్యవర్గంచే రోటరీ మాజీ గవర్నర్ డాక్టర్ బసవా వరహాలు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రస్తుత క్లబ్ గవర్నర్, కాకినాడ ట్రస్ట్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై. కళ్యాణ్ చక్రవర్తి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. రోటరీ ప్లాన్స్ అండ్ ప్రొగ్రామ్స్ చైర్మన్, సీనియర్ న్యాయవాది కూచిమంచి మల్లపరాజు, ఫౌండేషన్ చైర్మన్, బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ బోనం కనకయ్య తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## ప్రసాద్, శర్మలకు సత్కారాలు

అమలాపురం టౌన్: గురు సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మలకు స్థానిక రవీంద్ర విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఆ విద్యా సంస్థల అధ్యక్షుడు గిడుగు నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక రవీంద్ర పాఠశాలలో జరిగిన ప్రెషర్స్ డే వేడుకల వేదికపై ఆ ఇద్దరి ప్రముఖులను సత్కరించారు. ప్రసాద్, శర్మలను గజమాలలతో సత్కరించి, వారు సమాజానికి అందిస్తున్న సందేశాలను, సేవలను వక్తలు కొనియాడారు. విజేతలకు ముఖ్య అతిథులు ప్రసాద్, శర్మలు బహుమతులు అందజేశారు.

# ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు


లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గణపతిని అభినందిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణ రావు, ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: ప్రపంచ వ్యాప్తంలో అతిపెద్ద సేవా సంస్థ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అమలాపురం లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు సూదా గణపతి కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకరోత్సవ కార్యక్రమం లయన్స్ హాలులో శనివారం జరిగింది. పూర్వ అధ్యక్షుడు రవణం వేణుగో పాలరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ మాట్లాడుతూ లైన్స్‌క్లబ్ అంటే సర్వీస్ ఓరియంటెడ్‌గా మాత్రమే కాకుండా స్నేహాన్ని పెంపొందించే ఉన్నత సంస్థ అని వెల్లడించారు. లయిన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు గణపతి, నూతన కార్యవర్గం సభ్యులచే మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు గణపతిని మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మాజీ గవర్నర్ అనిల్ కుమార్, పీఎంజేఎఫ్ చిట్నీడి శ్రీనివాస్, పెద్దిరెడ్డి ఉమామహేశ్వ రరావు, వేలూరి సూర్యనారాయణ, డాక్టర్ పీఎస్ శర్మ, దేవి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, నల్లా పవన్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మండల బాబి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్ అమలాపురం ప్రింట్ మీడియా అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రంబాల సత్యనారాయణ సత్కరించారు.

జూలై 6 - వరల్డ్ జూనోసిస్ డే



ప్రమాదవశాత్తూ కుక్కకాటుకి గురైతే వెంటనే
యాంటి రేబిస్ ఇంజక్షన్ వేయించండి
పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు
అన్ని రకాల వ్యాక్సిన్స్ అందుబాటులో ఉండును

పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

డా॥ రమ్యశైలజ, వైద్యాధికారిణి | డా॥ వై.రాహుల్ ఆడమ్స్, వైద్యాధికారి | మరియు పిహెచ్‌సి సిబ్బంది

- పెంపుడు కుక్కలకి తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించండి
- కుక్క ఉన్న యజమాని ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్ వేయించుకోవలెను
- కుక్క కరిచిన వెంటనే 15 ని॥ సబ్బుతో కడగాలి
- బాగా లోతుగా కరిస్తే కుట్లు వేయించరాదు
- శుభ్రపరచి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలి

వరల్డ్ జూనోసిస్ డే



బెండమూర్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

డా॥ ఎ.ఎస్.సూర్యనాగేష్ MBBS, వైద్యాధికారి | జి.సాయి సుస్వర MBBS, వైద్యాధికారిణి | మరియు పిహెచ్‌సి సిబ్బంది